


ఆదివారం 5 జూలై 2026 పేజీలు : 8

# బీఎల్‌వోల ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఫారమ్‌ల పంపిణీ



**రాయికోడ్ జూలై 4 (ప్రజా జ్యోతి):**
ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా బూత్ లెవల్ అధికారులు ( బిఎల్ఓ) ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారమ్‌ల పంపిణీ చేపట్టారు.అర్హులైన ఓటర్లకు ఫారమ్‌లను అందజేస్తూ,వాటిని సక్రమంగా పూరించి అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత గడువులోగా సమర్పించాలని అవగాహన కల్పించారు.ఓటరు జాబితాలో కొత్త పేర్ల నమోదు,వివరాల సవరణ, చిరునామా మార్పు,పేర్ల తొలగింపు వంటి అంశాలకు సంబంధించిన ఫారమ్‌లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటరు వివరాలను సరిచేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచించారు. ప్రజలు బీఎల్‌వోలతో సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.

# మహాదేవ్‌పల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**కల్హేర్, జూలై 4 (ప్రజా జ్యోతి):** సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ నాగదర్ లక్ష్మి పోచయ్య శనివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. రూ.5 లక్షల వ్యయంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందేలా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుల లక్ష్మయ్య, కొమ్ముల పోచయ్య, గుల సాయిలు, గుల గణపతి, మాటూరి మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

# పెద్ద వాన కోసం రైతుల ఎదురుచూపు..!



**ఎండిపోతున్న చెరువులు, కుంటలు**

**చెరువుల్లో నీరు లేక బోర్లపై పెరిగిన భారం..**

**వందల ఎకరాల్లో వేసే పంటలపై రైతుల ఆందోళన**

**అందోలు, జులై 4 (ప్రజాజ్యోతి):**
ఆషాఢం ప్రారంభమైనా ఆశించిన వర్షాలు కురవకపోవడంతో అందోలు మండల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అందోలు ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో ఎండిపోవడంతో చెరువులపై ఆధారపడిన వేల ఎకరాల సాగుభూమి ప్రశ్నార్థకంగా మారింది. సాధారణంగా ఈ సమయానికి నీటితో కళకళలాడాల్సిన చెరువులు ప్రస్తుతం అక్కడక్కడా చిన్న చిన్న నీటి గుంటలతోనే కనిపిస్తుండగా, రైతుల్లో నిరాశ నెలకొంది. మండలంలోని - మిగతా3లో

## మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా: మర్రి అరుణ కుమారి

**మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధ్యక్షురాలు**



**అందోల్, (ప్రజాజ్యోతి):** అందోల్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన మర్రి అరుణ కుమారి శనివారం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని మర్రి అరుణ కుమారి తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని, మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళల సమస్యల పరిష్కారం, సంక్షేమం, సాధికారత కోసం నిరంతరం పనిచేస్తానని చెప్పారు. అలాగే అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ తన వంతు సేవలందిస్తానని పేర్కొన్నారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై మహిళల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని, మహిళా కాంగ్రెస్ సంస్థాగత బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్షించారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళా నాయకుల పాత్ర కీలకమని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# దొడ్డి కొమురయ్య త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం

## వర్ధంతి సందర్భంగా జోగిపేటలో కురుమ సంఘం నివాళులు

**అందోలు, జులై 4 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా గుర్తింపు పొందిన దొడ్డి కొమురయ్య త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జోగిపేట పట్టణ కురుమ సంఘం నాయకులు పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జోగిపేట క్లాక్‌టవర్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగిపేట మున్సిపల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు గొర్లకాడి మల్లేశం మాట్లాడుతూ, భూమి, భుక్తి, వెట్టిచాకిరి నిర్మూలన కోసం తన ప్రాణాలను అర్పించిన దొడ్డి కొమురయ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. పట్టణ కురుమ సంఘం యువజన అధ్యక్షుడు బిర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ, యువత దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన



కార్యదర్శి మాసాగోని మల్లేశం, కోశాధికారి ఊస జోగినాథ్, సలహాదారుడు ఉడెంకాడి ఆంజనేయులు, కడల కృష్ణ, సదాశివుడు, లక్ష్మణ్, ఎం. శ్రీనివాస్, బి. ఆనంద్, ఊస శివశంకర్, శివ, తులసి తదితరులు పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళు లర్పించారు.

# కొమురయ్యకు నివాళులు.. కురుమల ఐక్యతకు పిలుపు

## 80వ వర్ధంతి సందర్భంగా సంఘం నాయకుల పిలుపు





**అందోలు, (ప్రజాజ్యోతి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతిని పురస్కరించుకుని కన్సాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమం కురుమల ఐక్యతకు వేదికగా నిలిచింది. గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్ నవాబుగారి భూమయ్య, మాట్లాడుతూ, సమాజ హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య ఆశయాలను సజీవంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కురుమలందరూ సంఘటితంగా ఉంటేనే తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. మండల కురుమ సంఘం అధ్యక్షులు గడ్డమీద విట్టల్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కురుమ సంఘాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ ఐక్యతతోనే కురుమల అభివృద్ధి సాధ్యమవుతుందని, యువత సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కురుమల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రతి గ్రామంలో సంఘ భవనాల ఏర్పాటు, పశువైద్య సేవల మెరుగుదల, గొర్రెల కాపరులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గొర్రెల బీమా, మేత సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి బాల మల్లేష్, కోశాధికారి కడేం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, యూత్ అధ్యక్షులు రమేష్, ప్రవీణ్, కడేం గోపాల్, వివిధ గ్రామాల కురుమ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

### మీసేవలో పదో తరగతి మార్కుల మెమో ఈ-పత్రం సేవ ప్రారంభం

-- ఈడీఎం ఉదయ్ కుమార్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జులై 4:** పదో తరగతి (ఎస్ఎస్‌సీ) మార్కుల మెమో డూప్లికేట్ ఈ-పత్రాన్ని పొందేందుకు మీసేవ పోర్టల్‌లో "ఎస్ఎస్‌సీ మార్కుల మెమో ఈ-పత్రం" అనే కొత్త సేవను ప్రారంభించినట్లు ఈడీఎం ఉదయ్ కుమార్ తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..మీసేవ పోర్టల్‌లోని అన్ని సేవలు విభాగంలో ఎస్ఎస్‌సీ మార్కుల మెమో ఈ-పత్రం సేవను ఎంపిక చేసుకుని, అవసరమైన వివరాలను నమోదు చేసి తమ పదో తరగతి మార్కుల మెమో ఈ-పత్రం పొందవచ్చని తెలిపారు. అనంతరం ఆ ఈ-పత్రం



మీసేవ భద్రతా ధ్రువపత్రంపై ముద్రించుకోవచ్చని వివరించారు. ఈ సేవకు ఒక్కో దరఖాస్తుకు రూ.62 సేవా రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఈ కొత్త సేవను ప్రజలకు సత్వరంగా, సమర్థవంతంగా అందించాలని, అలాగే అర్హులైన విద్యార్థులు, దరఖాస్తుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

### చండి గ్రామంలో నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

– జిన్నారం శివకుమార్ గౌడ్





**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 04** శివ్వంపేట మండలం చండి గ్రామంలో ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని జిన్నారం శివకుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. నీటి శుద్ధి కేంద్రం వల్ల గ్రామ ప్రజలకు ఉచితంగా,పరిశుభ్రమైన తాగునీరు లభిస్తుందని తెలిపారు.ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని వారు తెలిపారు,చండి గ్రామ సర్పంచ్ గైనీబైటి ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ,, ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ట్రస్ట్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు,

### ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి:తపస్



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 04:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం శివ్వంపేట మండల కేంద్రంలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొండల్ రెడ్డి,మల్లేశం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తాసిల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కమలాద్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర బాధ్యులు రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డి ఎ లను విడుదల చేయాలని, పి ఆర్ సి నివేదికను తెప్పించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలు చేయాలని,సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని వెంటనే చెల్లించాలని అన్నారు. జిపిఎఫ్ పెండింగ్ నిధులను విడుదల చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని కోరారు. జీవో 317 వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని,గురుకుల,కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని,ప్రతి సంవత్సరం పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేఖర్,మండల బాధ్యులు రాజు,శ్రీనివాస్,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 3:--సంగారెడ్డి పట్టణంలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మ్యూజియంలో ఏర్పాటు చేసిన జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్, గణితం, వినోదాత్మక విజ్ఞాన ప్రదర్శనలు, ప్రముఖ శాస్త్రవేత్తల వివరాలు, అంతరిక్షానికి సంబంధించిన ఫోటో గ్యాలరీ, శాటిలైట్ నమూనాలు, డైనోసార్ నమూనా, బొటానికల్ గార్డెన్, సమావేశ మందిరంలో విద్యార్థులు రూపొందించిన గణిత ప్రాజెక్టులను పరిశీలించి కలెక్టర్ అభినందించారు. జిల్లా సైన్స్ మ్యూజియంలో త్వరలోనే రోబోటిక్స్‌కు సంబంధించిన ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న సంచార విజ్ఞాన ప్రయోగశాల, సోహం రోబోటిక్స్, జన్య ఫౌండేషన్ సైన్స్ ల్యాబ్ కార్యక్రమాల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సంచార విజ్ఞాన ప్రయోగశాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉన్న సైన్స్ ప్రయోగశాలలను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని అన్నారు. అదేవిధంగా పరిసరాల్లో లభ్యమయ్యే వస్తువులను ఉపయోగించి నిజజీవితానికి అనుసంధానించే విధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియంను సందర్శించదలిచిన పాఠశాలలు ముందస్తుగా జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డిని 63022 90235 ఫోన్ నంబర్ లో సంప్రదించి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శంకర్, డీసీఈబీ కార్యదర్శి లింబాజీ, జిల్లా సైన్స్ అధికారి పి. సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద వాన కోసం రైతుల ఎదురుచూపు..!







-మొదటిపేజీ తరువాయి

కన్సాన్ పల్లి కొండర్ చెరువు, అందోలు కొత్త చెరువు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా తయారైంది. పూర్తిగా ఎండిపోయిన చెరువుల వైపు చూస్తూ రైతులు ఆందోళనకు గురి అవుతున్నారు. చెరువుల్లో నీరు తగ్గిపోయిన కారణంగా చెరువుల అడుగుభాగం పూర్తిగా బయటపడింది. చెరువులోకి వరద నీరు చేరకపోవడంతో నిల్వలు అడుగంటిపోయాయి. మరోవైపు చెరువు కింద ఉన్న సాగుభూముల్లో రైతులు విత్తనాలు వేసినా, తగినంత తేమ లేక మొలకలు సరిగా రావడం లేదు. ఇప్పటికే సాగు ప్రారంభించిన రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**బోర్లలో తగ్గుతున్న నీటిమట్టం**

చెరువులు ఎండిపోవడంతో రైతులంతా బోరు బావులపై ఆధారపడుతున్నారు. అయితే భూగర్భ జలమట్టం కూడా రోజురోజుకూ తగ్గుతుండటంతో బోరు మోటార్లు తక్కువ నీటినే ఇస్తున్నాయి. కొన్నిచోట్ల బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో సాగు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఇప్పటికే విత్తిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎల్‌నినో ప్రభావంతో తగ్గిన వర్షపాతం**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. జూన్ నెలలో ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ సాగు మందగించింది. జూలై మొదటి వారంలోనూ పరిస్థితి మారకపోవడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది. వర్షాలు ఆలస్యమైతే పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

**సాగుపై పెరిగిన అనిశ్చితి**

చెరువుల నీటిపైనే ఆధారపడి పండించే వరి, మొక్కజొన్న, తదితర పంటల సాగు సందిగ్ధంలో పడింది. వర్షాభావం కొనసాగితే ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, దున్నకాల కోసం పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు వర్షాలు లేకపోతే తీవ్ర నష్టాలు తప్పవని వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వ్యవసాయ, నీటిపారుదల శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాలని రైతులు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు, పంట నష్టపోయే రైతులకు ప్రత్యేక సహాయ చర్యలు ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రకృతి కరుణిస్తేనే ఈ ఖరీఫ్ సీజన్ గట్టెక్కుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో సామాజిక ప్రజా పోరాటాలు నిర్వహిద్దాం: కేవీపీఎస్



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 4:** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్ మాట్లాడుతూ..వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిందని తెలిపారు. దున్నే వాడికే భూమి అనే నినాదంతో వేలాది మంది రైతులు పోరాటంలో పాల్గొన్నారని, ఆ ఉద్యమంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య అని పేర్కొన్నారు. కడివెండి గ్రామంలో భూస్వాముల గుండాల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి కొమరయ్యపై కాల్పులు జరపడంతో ఆయన అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో పేదలకు భూములు, ఇళ్ల స్థలాలు, విద్య, వైద్యం, సామాజిక న్యాయం కోసం, అలాగే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు, న్యాయవాది సుభాష్, సంతోష్ కుమార్, గణపతి, సామాజిక ఉద్యమ సీనియర్ నాయకుడు కాన్సిరాం, కేవీపీఆర్ జిల్లా నాయకులు మోహన్, బాబురావు, శ్రీనివాస్, రాఘు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎం. శ్రీనివాస్ గౌడ్



**కల్హేర్, జూలై 3 ((ప్రజాజ్యోతి):** కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఎం. శ్రీనివాస్ గౌడ్ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు , నారాయణఖేడ్ ఎమ్మెల్యే , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యత ఇస్తూ తనకు ఈ బాధ్యతలు అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని, సీనియర్ నాయకుల సలహాలు, సూచనలతో సమన్వయంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఎం. శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

# అవగాహన లేని ఓటర్ ఎస్ఐఆర్ సర్వే పై అధికారుల నిర్లక్ష్యం

## వలన ప్రజల ఓట్లు పోయే ప్రమాదం సిపిఐ డివిజన్ కార్యదర్శి కే.నర్సిములు ఆరోపణ



**జహీరాబాద్, జూలై 04( ప్రజా జ్యోతి న్యూస్ )** నియోజక వర్గంలో చేపడు తున్న ఓటర్ ఎస్ఐఆర్, సర్వే పై సిపిఐ డివిజన్ కార్యదర్శి కే. నర్సిములు ఆరోపిస్తూ ఎస్ఐఆర్, సర్వే పై అధికారులకే సరిగ్గా అవగాహన లేదు. క్రింది స్థాయి అధికారులకు ఏమి అవగాన ఉంటింది డోర్ టూ డోర్ ఎస్ఐఆర్ ఫామ్స్ డిస్టపుట్ చేస్తున్నారు. కానీ వాటిని ఏవిదంగా నింపాలి అనేది ప్రజలకు చెప్పడం లేదు. అసలు అధికారులకే అవగాహనా లేదు మరి కొందరు చదవు కునవారు వున్నారు. మరికొందరు చదువు లేని వారు వున్నారు. మరి అట్టి ఫామ్ ను ఎవ్వరు నింపాలి బిఎల్ఓ లకు సైతం అవగానాలేదు.వారు ఫామ్ ను నింపి ఇవ్వండి అంటున్నారు. అందులో ఏకాలంలో ఏమి నింపాలో ఎక్కడ ఏమి నింపితే తప్పులు అవుతాయి అన్ని ప్రజలు అయోమయంలో వున్నారని అన్నారు. దీనివలన ప్రజల ఓట్లు పోయే ప్రమాదం ఉందని అయన అన్నారు. 2002 సంవత్సరం యొక్క ఓటర్ లిస్టులో మీపేరు మీరు ఎక్కడ ఓటు వేసినారు. అందులో మీ సీరియల్ నెంబర్ ఎంత క్రమం సంఖ్య ఎంత అప్పుడు మీ అమ్మ నాన్న ల ఓటు ఎక్కడ వేసినారు. ఇలాంటి కోర్రిలు పెట్టడంవలన ప్రజలు ఏమిచేయాలో తెలియక ఇబ్బందులు పదుతున్నారు. అందుకని ఇప్పటి కైనా పై అధికారులు ఎస్ఐఆర్ పైన క్రింది స్థాయి అధికారులకు మరియూ బిఎల్ఓ లకు ఎస్ఐఆర్ పై అవగాహనా కల్పించి ప్రజలోకి వెళ్లి ప్రజలకు వివరంగా చెప్పాలని ఫారం నింపని వారికి ఫారలు నింపి ఇవ్వాలని 2002 ఓటర్ లిస్టులు అధికారులు బిఎల్ఓ లపై అధికారుల నుండి లేదా ఆర్డిఓ రెవెన్యూ మునిసిపల్ కార్యాలయంలో నుండి తీసుకొవాలని అయన అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐఆర్, సర్వేలు చేపట్టాలని అయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## దొడ్డి కొమురయ్య త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుందాం

**-- ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, జూలై 4:** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్ మండల పరిధిలోని జుక్కల్ శివారులోని ఆయన విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్‌తో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, బహుజనుల విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వెనుకబడిన, పీడిత వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. దొడ్డి కొమురయ్య ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజీ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఠల్‌రావు పాటిల్, రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరి రెడ్డి, రామచందర్ నాయక్, కౌన్సిలర్ బాణాపురం రాజు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ముంతాజ్ సెట్, సుకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, బీసీ కులాల ప్రముఖులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ప్రభాకర్ కురుమ



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 4:** దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నారాయణఖేడ్ నియోజకవర్గం కురుమ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ కురుమ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా నారాయణఖేడ్ మండలం జుక్కల్ శివారులోని ఆయన విగ్రహానికి శనివారం కురుమ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ కురుమ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బహుజనుల హక్కుల పరిరక్షణే ఆయనకు అందించే నిజమైన నివాళి అని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం గౌరవ అధ్యక్షులు అంజన్న, జిల్లా నాయకుడు మల్గొండ, బీజేపీ నారాయణఖేడ్ మండల అధ్యక్షులు సిందోల్ దశరథ్, కురుమ సంఘం నాయకులు ఉపసర్పంచ్ భీమన్న, తుకారం, సాయిగౌండ, ఇతర కురుమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులర్పించారు.

## మోహరం, పీర్ల ఉత్సవాల్లో పాల్గొన్న ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం



**జహీరాబాద్, జూలై 04( ప్రజా జ్యోతి న్యూస్ )** నియోజక వర్గంలో శుక్రవారం ఝరాసంఘం మండలం బోపన్ పల్లి గ్రామంలో జరిగిన (బాద్ మోహరం)లాల్ సాహెబ్, మై బాషా, పీర్ల ఉత్సవాల్లో ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం పాల్గొన్నారు. గ్రామంలో పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలికి, గ్రామం నుండి పీర్లను బాజా బజంత్రీలతో ఊరేగింపుతో పీర్ల వరకు వెళ్లి అక్కడ పీర్లకు గంధం,దట్టి, పూలు సమర్పించి, పీర్లను దర్శించు కోవడం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మతసామ రస్యానికి ప్రతీకగా మొహరం పండుగ నిరుస్తుందని భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం మాన ప్రత్యేకత అన్నారు. ఈ సందర్భంగా మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విజేందర్ రెడ్డి, జి.నర్సింలు, మాజీ సర్పంచ్ శంకర్, శ్రీనివాస్, గ్రామ నాయకులు గోపాల్ రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, మానేప్ప, సిద్ధప్ప, మోహన్ రెడ్డి, పవన్ రాథోడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి

**-నెట్ డాటా డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్**



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 4: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజాభివృద్ధి, దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని నెట్ డాటా డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెట్ డాటా సంస్థ ఆధ్వర్యంలో, యూత్ ఫర్ సేవా సభ్యులు చంద్రశేఖర ఆచార్య సౌజన్యంతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిప్పరాజు ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సర్వాంగీణ వికాసం సాధించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నెట్ డాటా సంస్థ గత పదేళ్లుగా విద్యార్థులకు విద్యా సామగ్రి, ల్యాప్‌టాప్‌లు, దివ్యాంగులకు వీల్‌చైర్లు అందించడంతో పాటు ప్రతి నెల రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో మరిన్ని సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జ్యోతి భూపాల్, శ్రీకాంత్, జకరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వరరావు, సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు గీత గోసంగి, అమిత్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్నూర జూనియర్ కాలేజీలను అకస్మిత తనిఖీ

**జిల్లా ఆహార భద్రత అధికారి రాజేశ్వర్**



ఆత్నూర 4 జులై (ప్రజా జ్యోతి)సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ శతజయంతి జూనియర్ కళాశాల హాస్టల్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో హాస్టల్ వంటగది మరియు స్టోర్‌రూమ్‌లో పలు ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, కిరాణా సరుకులు మరియు పిండి పదార్థాల్లో నల్ల బీటిల్స్ (కీటకాలు) మరియు తెల్లని పురుగులు కనిపించాయి. ఆహార పదార్థాల పైన తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు భావన సీలింగ్ పెచ్చులు ఊడిపోయే స్థితిలో ఉండటంతో అవి విద్యార్థులపై పడే ప్రమాదం ఉందని ఆహార భద్రత అధికారి ఆందోళన వ్యక్తం చేశారు.

## దత్తగిరికి దేవుళ్ళకు ఆహ్వానం

**రాజగోపుర ఉత్సవానికి దేవుళ్లకు స్వాగతం**

**శాస్త్రోక్తంగా శిఖర పూజలు**

**ఆదివారం ప్రారంభానికి సిద్ధం**





జహీరాబాద్, జూలై 04( ప్రజా జ్యోతి న్యూస్ ) జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతున్న ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నినాదాలతో ప్రతిధ్వనిస్తోంది. ఆశ్రమంలో నూతనంగా సర్వాంగ సుందరంగా నిర్మించిన రాజగోపుర ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం మహాకుంభ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, జలాధివాసం, క్షీరాధివాసం, పూర్ణాహుతి, పంచగవ్య ప్రాశనం, పంచగవ్య ఆగమ శాస్త్ర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, మహా కుంభారాధన, అగ్ని ఆరాధన, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, శయ్యాధివాసం, పుష్పాధి వాసం తదితర పూజలను నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతులు 1008 అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పర్యవేక్షణలో రాజగోపుర ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం వేదోక్తంగా నిర్వహించనున్న రాజగోపుర ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాజగోపుర నిర్మాణదాత కోలన్ సునీత భద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందగిరి, నందిని శ్రీ, నరసింహారెడ్డి, లింగా రెడ్డి, సిద్దారెడ్డి, నిజాంపేట్ మాజీ సర్పంచ్ సాయిలు, జీవన్ రావు, సంగారెడ్డి తదితరులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పేద బలహీన వర్గాలకు అండగా సీఎంఆర్ఎఫ్ -- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి



కల్హే ర్. 4.జూలై. ప్రజా జ్యోతి కల్హేర్: పేద ప్రజలకు అత్యవసర వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కల్హేర్ మండలం ఖానాపూర్ (కె) గ్రామానికి చెందిన నాగూరి సాయిలుకు రూ. 26,500, కృష్ణాపూర్ గ్రామానికి చెందిన సుజాతకు రూ. 19,500, కోటగిరి బాలయ్యకు రూ. 54,000, కంగ్టి మండలం బీమ్రా గ్రామానికి చెందిన శరణప్పకు రూ. 36,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్ సింగ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు రవీందర్ శెట్కార్‌కు రూ.20 వేల ఆర్థిక సాయం.



కల్హే ర్. 4.జూలై. ప్రజా జ్యోతి. కల్హే ర్ /నారాయణఖేడ్ టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు రవీందర్ శెట్కార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, సంఘీభావం చాటుతూ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నాయకులు ఆసిఫ్, అలీమ్, రౌఫ్, వెంకటేశం, దత్తు రెడ్డి మాట్లాడుతూ, రవీందర్ శెట్కార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సంఘం తరఫున ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొని రవీందర్ శెట్కార్‌కు ధైర్యం చెప్పారు.

## రావుస్ ఇంటర్నేషనల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు

**సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవిత దేవి**





జహీరాబాద్, జూలై 04( ప్రజా జ్యోతి న్యూస్ ) మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక రావ్స్ ఇంటర్నేషనల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవిత దేవి నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన అంశాల పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించి చక్కగా చదువుకో వాలని, చదువుతో పాటు సాధారణ చట్టాల పై అవగాహన పెంపొందించు కోవాలని అన్నారు. బ్యాడ్ టచ్ గుడ్ టచ్ పై వివరించారు. బాలికల పట్ల, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించిన వారు కఠిన శిక్షలకు లోనవుతారని తెలియజేశారు. కార్యక్రమం లో మోటార్ వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహ నిర్మూలన చట్టం, సైబర్ మోసాలు, ఉచిత న్యాయసేవా సహాయం పై విద్యార్థులకు తెలియ జేసారు. మీ చుట్టు బాల్య వివాహ బాధితులు, బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నట్లు గుర్తిస్తే స్కూల్ ప్రిన్సిపాల్ కు నేరుగా గాని, 1098 లేదా 100 కి ఫోన్ ద్వారా గాని, మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయని తెలుపవచ్చని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయం ను సంప్రదించ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి న్యాయ వాదులు శ్రీనివాస్ కన్నా, సోమశేఖర్, విశ్వనాధ్, రాఘవేంద్ర నాయక్, ఇస్మాయిలప్ప, అనూష పాఠశాల ప్రధానోపాధ్యాయు లు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికైన కాంగ్రెస్ మండల అధ్యక్షులకు ఘన సన్మానం



కల్హే ర్ . 4.జూలై. ప్రజా జ్యోతి నారాయణఖేడ్: కల్హేర్, నారాయణఖేడ్ మండలాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన ఎం.శ్రీనివాస్ గౌడ్, పడాల జ్ఞానేశ్వర్ రెడ్డిలను స్థానికంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగాజిల్లాయూత్ కాంగ్రెస్ యువజన నాయకుడు వినోద్ పాటిల్, జీఎస్ఆర్ సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి వారికి అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గైని దేవదాస్, పి. వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన మండల అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అన్ని ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను

# విజయవంతంగా అమలు చేయాలి






ఫార్మర్ రిజిస్ట్రీ వంద శాతం పూర్తి చేయాలి

పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి.....

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 4:** వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలను సమర్ధవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్ లకు సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్ని ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను జిల్లాల్లో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువుల లభ్యత, ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, ఫార్మర్ రిజిస్ట్రీ, తాగునీటి సరఫరా, ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, జిల్లాల వారీగా వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా రైతులను ఆయా పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, అక్రమ నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నానో యూరియా వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని పేర్కొంటూ, అర్హులైన ప్రతి రైతు నమోదు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి పథకాల అమలును వేగవంతం చేయాలని సూచించారు. వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత మెరుగుపరిచేందుకు జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని, రైతులకు అవసరమైన అన్ని వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వం ప్రతిపాదించిన సన్నరకం వరి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తూ వంద శాతం నమోదు పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, సింగూర్ ప్రాజెక్ట్ మరమ్మత్తులు జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు జోగిపేటలో స్థలాన్ని గుర్తించామని తెలిపారు. డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్యకు ఘన నివాళు లర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 4:–** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడని, ఆయన త్యాగం, ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

## బండి భగీరధ్ కు బెయిల్ వద్దు

**హైదరాబాద్ :** బండి సాయి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ పోలీసులు హైకోర్టును కోరారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోక్సో కేసులో ఈ మేరకు పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పోలీసులు తమ అఫిడవిట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్ జులై 3న దాఖలు చేసిన కౌంటర్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్, ఆమెను లోబర్చుకుని 2025 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీరామ్ గార్డెన్స్, నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటనలు జరిగినట్లు తెలిపారు.

## బ.ఏల.ఓ , సర్ విధుల నుంచి అంగన్వాడీలకు విముక్తి కల్పించాలి.

జూలై 6న జిల్లా కేంద్రాల్లో ప్రజావాణికి వినతిపత్రాలు సమర్పించనున్న తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ ఌ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ)

**కల్వ‌ ర్ , జూలై 4: ప్రజా జ్యోతి.** అంగన్వాడీ టీచర్లపై విధిస్తున్న బ.ఏల.ఓ , సర్ విధుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ ఌ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జూలై 6 (సోమవారం) రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని యూనియన్ పిలుపునిచ్చింది. అంగన్వాడీ టీచర్లకు బి .ఏల.ఓ , సర్ విధులను వెంటనే రద్దు చేయాలని, ఒకవేళ కొనసాగిస్తే సర్ విధులకు అదనంగా నెలకు రూ.30,000 పారితోషికం చెల్లించాలని యూనియన్ డిమాండ్ చేసింది. సర్ సర్వే పూర్తయ్యే వరకు సాధారణ అంగన్వాడీ విధుల నుంచి పూర్తి మినహాయింపు కల్పించాలని కోరింది. హెల్పర్ లేని కేంద్రాలకు త్ర పంపిణీ చేసే అవకాశం కల్పించాలని, ప్రత్యేక వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని (బి ఏల్ .ఓ )విధుల నుంచి తప్పించాలని తెలిపింది. (బి ఏల్. ఏ. )లు తమ బాధ్యతలు నిర్వర్తించడం లేదని, వారిని విధుల్లో పెట్టాలని లేదా ప్రత్యామ్నాయంగా ప్రతి కేంద్రానికి అదనపు వాలంటీర్‌ను నియమించాలని డిమాండ్ చేసింది. ఆన్‌లైన్ నమోదు కోసం ప్రతి గ్రామానికి ఒక




కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని, గత ఐదేళ్లలో (బి ఏల్.ఓ) లకు ప్రభుత్వం చెల్లించిన పారితోషిక వివరాలను బహిరంగంగా వెల్లడించాలని కోరింది. ఆదివారాలు, పండుగలు, కుటుంబ అవసరాలు, పెళ్లిళ్ల వంటి సందర్భాల్లో సెలవులు మంజూరు చేయాలని, ఓటరు గుర్తింపు కార్డులకు సంబంధించిన సాంకేతిక సమస్యలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని పేర్కొంది. అంగన్వాడీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులను అరికట్టాలని యూనియన్ డిమాండ్ చేసింది. (సర్ )సర్వేకు గడువును పొడిగించాలని, ప్రీ–ప్రైమరీ, పీఎం శ్రీ కేంద్రాల అమలును నిలిపివేయాలని కోరింది. లేనిపక్షంలో ు×= విధులను బహిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేపట్టాల్సి వస్తుందని యూనియన్ హెచ్చరించింది. జూలై 6న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని విజయవంతం చేసి, జిల్లా కేంద్రాలకు పెద్ద ఎత్తున హాజరై వినతిపత్రాల సమర్పణలో పాల్గొనాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ ఌ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ అన్ని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు పిలుపునిచ్చింది.